
అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607
# జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..



విపక్షాల ఐక్యతకు పరీక్షా కాలం

WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -340 శుక్రవారం 17 ఏప్రిల్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-
Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



## ఏపీకి 38, తెలంగాణకు 26

డీలిమిటేషన్‌పై అమిత్ షా కీలక ప్రకటన

లోక్‌సభ స్థానాల పునర్విభజనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా హామీ

డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగదని స్పష్టత

ఏపీలో 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కి సీట్లు పెరుగుతాయని వెల్లడి

ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అమిత్ షా విమర్శ

2లో.

# డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం జరగదు

మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం

### పార్లమెంటులో ప్రధాని మోడీ

ఇందులో ఎలాంటి రాజకీయం లేదు

30 ఏళ్లుగా మహిళలు ఎదురు చూస్తున్నారు

వారికి అవకాశం ఇవ్వడం మన బాధ్యత

చట్టసభల్లోనూ వారి సత్తా చాటేలా చేద్దాం

ఈ బిల్లు ఆమోదంలో నాకు క్రెడిట్ వద్దు

ఏకగ్రీవంగా ఆమోదించే విపక్షాలకే దక్కుతుంది

దీనిని విస్మరించే వారిని మహిళలు క్షమించరు

ఉత్తరాది, దక్షిణది అంటూ విభజన తేవద్దు

డీలిమిటేషన్‌తో దక్షిణాదికి ఎలాంటి అన్యాయం జరగదు

మహిళా బిల్లుపై పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 16(జర్నలిస్ట్ వార్త);**
మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దు అని ప్రధాని మోదీ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఏ పార్టీకి అనుకూలం కాదు అన్నారు. దానికి రాజకీయ రంగు పూయవద్దు అన్నారు. ఎవరు బాధ్యులైనా, ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆలస్యం చేశామన్నారు. ఈ బిల్లులను తీసుకువచ్చిన సక్సెస్ ట్రెజరీ బెంచ్‌లకు కానీ, మోదీకి కానీ దక్కదని, ఇది భారత ప్రజాస్వామ్యానికి దక్కుతుందని ఆయన అన్నారు. లోక్‌సభలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంలో క్రెడిట్ ఎవరిదన్న దానిపై ఆలోచించరాదు అన్నారు. కావాలంటే మీరు క్రెడిట్ తీసుకోవచ్చు అని ఆయన ప్రతిపక్షాలకు చెప్పారు. ముందుగా 33 శాతం మంది మహిళలు ఇక్కడకు రావాలన్నారు. భారతీయ సోదరీమణులను నమ్మండి అని, వారి ఇంటెలిజెన్స్‌ను గుర్తించాలన్నారు. నారీ శక్తి వికసిత్ భారత్‌కు **మిగతా 2లో...**

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామి

ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మేడిన్ తెలంగాణ' మార్క్


అమెరికా పెట్టుబడిదారులకు తెలియ చేయండి

అమెరికన్ నేషనల్ వార్ కాలేజీ బృందంతో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,ఏప్రిల్ 16(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని అమెరికా పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. డ్రోన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అమెరికా 'నేషనల్ వార్ కాలేజ్' బృందంతో గురువారం మంత్రి సమావేశమయ్యారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో స్కిల్డ్ వర్క్ ఫోర్స్ సిద్ధంగా ఉందని.. 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. **మిగతా 2లో..**

## ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది: ట్రంప్



2లో.



## ఇండియా, పాకిస్తాన్‌లా విభజించారు

తెలంగాణ, ఏపీ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వివాదాస్పద వ్యాఖ్యలు

ప్రతిపక్ష ఎంపీల మండిపాటు

క్షమాపణ చెప్పాలని డిమాండ్

**న్యూఢిల్లీఏప్రిల్ 16(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గురువారం లోక్‌సభలో మహిళా రిజర్వేషన్లు, సీట్ల పెంపు సవరణ బిల్లులపై చర్చలో భాగంగా రాష్ట్ర విభజనను తప్పుబట్టేలా విమర్శలు చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్‌తో పోల్చారు**మిగతా 2లో...**

## పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశం.. విచారణ జూన్ 6కు వాయిదా

**హైదరాబాద్ :ఏప్రిల్ 16(జర్నలిస్ట్ వార్త);**
పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన తొమ్మిది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేసిన కేసులో ఫిరాయింపుదారులుగా చెబు తున్న వాళ్లకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఫిరాయింపుదారులు కాదంటూ స్పీకర్ ఇటీవల ఇచ్చిన **మిగతా 2లో..**



## తేజస్వి ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి


: పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ :ఏప్రిల్ 16(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెను దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ తేజస్వి సూర్యపై నిప్పులు చెరిగారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు అత్యంత అజ్ఞానంతో కూడుకున్నవని, అవి ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగించేలా ఉన్నాయని పొన్నం పేర్కొన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలను వెంటనే లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని, రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన రాష్ట్రాన్ని అవమానించినందుకు ఆయన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. **మిగతా 2లో..**

## మొదలైన జనగణన

చరిత్రలో తొలిసారిగా పూర్తిగా డిజిటల్ విధానంలో జనగణన



ఏపీలో జనగణన-2027 తొలిదశ ప్రక్రియ

ప్రజల కోసం కొత్తగా స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) సదుపాయం

తప్పుడు సమాచారం ఇస్తే క్రిమినల్ చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరిక

ఎన్యూమరేటర్లుగా 80 శాతం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నియామకం

**అమరావతి :ఏప్రిల్ 16(జర్నలిస్ట్ వార్త);**
ప్రపంచంలోనే అతిపెద్ద గణాంక కార్యక్రమమైన భారత జనగణన-2027కు ఏపీలో రంగం సిద్ధమైంది. తొలిసారిగా పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్న ఈ బృహత్తర కార్యక్రమంలో మొదటి దశ ఇవాళ్టి నుంచి ప్రారంభం కానుంది. తొలి విడతలో భాగంగా ఇళ్ల జాబితా, గృహ గణన**మిగతా 2లో...**



## దేశవ్యాప్తంగా మండుటెండలు

అప్రమత్తంగా ఉండాలన్న ఐఎండి


**న్యూఢిల్లీ,ఏప్రిల్ 16(జర్నలిస్ట్ వార్త);**
దేశ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు భగభగమండుతున్నాడు. మధ్యాహ్నం బయట తిరగాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేశంలోని చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా **మిగతా 2లో...**

## కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

8 మంది భక్తుల మృతి

కర్నూలు జిల్లా మంత్రాలయం మండలంలో ఈరోజు తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీ రాఘవేంద్రస్వామి వారి దర్శనానికి వెళుతున్న భక్తుల వాహనం ప్రమాదానికి గురవడంతో 8 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 12 మంది గాయపడ్డారు.

2లో.



మంత్రాలయం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

బొలెరో వాహనాన్ని ఢీకొట్టిన రెడీమిక్స్ లారీ

ఘటనలో 8 మంది కర్ణాటక భక్తులు అక్కడికక్కడే మృతి

మరో 12 మందికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు

రాఘవేంద్ర స్వామి దర్శనానికి వెళ్తుండగా ఘటన

# మొదలైన డిజిటల్ జనగణన

**మొదటిపేజీ తరువాయి**

(హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్) చేపడుతున్నట్లు రాష్ట్ర జనగణన డైరెక్టర్ జె. నివాస్ తెలిపారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

ఈసారి జనగణన ప్రక్రియలో ప్రజలే స్వయంగా తమ వివరాలు నమోదు చేసుకునేందుకు 'స్వీయ గణన' (సెల్ఫ్ ఎన్యూమరేషన్) సదుపాయాన్ని కల్పించినట్లు నివాస్ వెల్లడించారు. రాష్ట్రంలో ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు ఈ అవకాశం అందుబాటులో ఉంటుందని చెప్పారు. ప్రజలు ఈ విధానాన్ని వినియోగించుకోవచ్చని లేదా ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు వారికి సహకరించవచ్చని కోరారు. ప్రజలు ఇచ్చే సమాచారం అత్యంత భద్రంగా ఉంటుందని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని భరోసా ఇచ్చారు.జనగణన విధులకు ఆటంకం కలిగించినా లేదా ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం అందించినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేటర్లుగా 80 శాతం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులనే నియమించినట్లు స్పష్టం చేశారు. మిగిలిన 20 శాతం ఇతర శాఖల ఉద్యోగులు ఈ విధుల్లో పాల్గొంటారని వివరించారు.

# ఇండియా, పాకిస్తాన్‌లా విభజించారు

**మొదటిపేజీ తరువాయి**

." (బ్రిటీషర్స్ కంటే చెత్తగా తెలుగు రాష్ట్రాన్ని కాంగ్రెస్ విభజించింది. ఆనాడు ఇండియా-పాకిస్తాన్ విభజన మాదిరిగా తెలంగాణ, ఏపీని విభజించారు. విభజన సమయంలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరుతో ఇప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది' అని ఆయన విమర్శించారు. అలాగే డీలిమిటేషన్‌పై ప్రతి పక్షాలు దక్షిణాది రాష్ట్రాల ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని తేజస్వీ ఆరోపించారు. మహిళా రిజర్వేషన్, తదితర బిల్లును ఎలాగైనా అడ్డు కోవాలని, ప్రతిపక్షాలు కొత్తదారులు వెతుకుతున్నాయని మండిపడ్డారు. ఈ సందర్భంగా దేశంలో నియోజకవర్గాల పునర్విభజన విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ ఫార్ములాపై తేజస్వీ సభలో ప్రస్తావించారు. ఆ ప్రతిపాదనను ఆయన కొట్టిపారేశారు. సీట్ల సంఖ్య ఆధారంగా జీడీపీకి ముడిపెట్టాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సలహా అత్యంత తెలివి తక్కువైనదని అన్నారు. అలాంటి ప్రతిపాదనతో ముందుకెళితే ఒక వ్యక్తి, ఒక ఓటు అన్న రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రానికి విలువే ఉండదన్నారు. రాష్ట్రాల ఆదాయం ఏటా మారుతూ ఉంటుందని, దానిని డీలిమిటేషన్ ప్రతిపాదికన తీసుకోవడం సరికాదని చెప్పారు. ఆదాయం ప్రకారం ఓట్లు ఇవ్వాలని అనుకుంటే.. దేశంలో అత్యంత ఆదాయం ఉన్న అంబానీ లక్ష ఓట్లు ఇవ్వాల్సి వస్తుందని సెటైర్లు వేశారు.

**తేజస్వీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఫైర్**

తేజస్వీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు ఫైర్ అయ్యారు. పార్లమెంట్ ఆవరణలో ఎంపీలు తేజస్వీకి గట్టి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ఏర్పాటుపై తేజస్వీ వ్యాఖ్యలను మరోసారి బీజేపీ పార్టీ అక్కసు బయటపెట్టాయని మండిపడ్డారు. అసలు సంబంధమే లేని అంశంలో తెలంగాణ విభజనను తీసుకురావడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రధాని మోదీ, అమిత్ షా ప్రోద్బలంతోనే తేజస్వీ ఇలాంటి వ్యాఖ్యలకు సిద్ధపడ్డారన్నారు. తెలంగాణ బిడ్డల ఆత్మ బలిదానాలతో సాధించుకున్న తెలంగాణ ఏర్పాటును పార్టీ ఎంపీ వక్రీకరిస్తోన్నారు రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎంపీలు స్పందించకపోవడాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఈ వ్యాఖ్యలపై ప్రధాని మోదీతో పాటు తేజస్వీ సూర్య, రాష్ట్రానికి చెందిన మంత్రులు, బీజేపీ ఎంపీలు రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

# పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

తీర్పును సవాలు చేస్తూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలంటూ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులో తెలిపింది. ఆ తర్వాత కౌంటర్లు దాఖలు చేయాలని పిటిషనర్లను ఆదేశించింది. విచారణను జూన్ 6వ తేదీకి వాయిదా వేసింది. బీఆర్ఎస్ తరఫున ఎంపికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం నాగేందర్, కడియం, శ్రీహరి, పోచారం శ్రీనివాసరెడ్డి, యాదయ్య, కృష్ణమోహన్ రెడ్డి, టి.ప్రకాశ్ గౌడ్, ఎ.గాంధీ, తెల్లం వెంకటరావు, సంజయకుమార్, గూడెం మహిపాల్‌రెడ్డిలపై అనర్హత వేటు వేసేందుకు స్పీకర్ నిరాకరిస్తూ తీర్పు చెప్పారు. ఈ తీర్పులను సవాలు చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జి.జగదీశ్‌రెడ్డి, కె.పి.వివేకానంద, కె.సంజయ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీహెచ్.ప్రభాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్లు వేశారు. వీటిని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన బెంచ్ గురువారం విచారించింది.

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

**మొదటిపేజీ తరువాయి**

అమెరికాతో దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. టెక్నాలజీ, రీసెర్చ్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో సహకారాన్ని మరింత పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఏరోస్పేస్ రంగం ఏటా సగటున 30 శాతం వృద్ధి నమోదు చేస్తోంది. ఎగుమతుల్లో 103 శాతం సీఏజీఆర్‌తో తెలంగాణ దూసుకుపోతోంది. రాకెట్ల నుంచి శాటిలైట్ల వరకు అన్ని ఉత్పత్తులపై 'మేడ్ ఇన్ తెలంగాణ' ముద్ర పడుతోంది. ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో తమ కార్యకలాపాలు విస్తరించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 1500కి పైగా ఎంఎస్ఎంఈలతో తెలంగాణ గ్లోబల్ బ్రాండింగ్ ఎదుగుతోంది. 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ టాప్ స్థానంలో నిలిచింది. వరుసగా ఐదు సార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును అందుకోవడం తెలంగాణ సాధించిన మరో విజయం.ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించాలని, ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. డ్రోన్స్, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, ఏరోస్పేస్ కాంపోనెంట్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ ఇన్ డిఫెన్స్, శాటిలైట్ సిస్టమ్స్ అండ్ అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్స్ లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఇక్కడి అనుకూలతలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీలు మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వివరించారు. రాకెట్ తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు... అన్నింటిలోనూ 'మేడిన్ తెలంగాణ' మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందన్నారు. ఈ రంగంలో తెలంగాణ ఏటా 30 శాతానికి పైగా వృద్ధిని రేటును నమోదు చేస్తోందన్నారు. అలాగే... 2024-26 మధ్య కాలంలో ఎగుమతుల్లో 103 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్(సీఏజీఆర్) నమోదయ్యిందన్నారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్, సాఫ్రాన్, ఎయిర్ బస్, డస్సాల్ట్ ఏవియేషన్ తదితర ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలతో డీఆర్డీవో, భెల్, మిధాని, బీడీఎల్,ఆర్ సీఐ, హాల్ తదితర కేంద్ర రంగ ప్రభుత్వ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇవీ కాకుండా... ప్రిసిషన్ ఇంజనీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1,500 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు 'తెలంగాణ బ్రాండ్'ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ÷నాన్షియల్ టైమ్స్ ఎఫ్ డీఏ ర్యాంకింగ్స్ ప్రకారం, ప్రపంచంలోనే అత్యంత 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును గెలుచుకుని 'గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్'లో తెలంగాణ ఒక శక్తిమంతమైన కేంద్రంగా మారిందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు అవసరమైన ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీజీ ఐపాస్ ద్వారా 15 నుంచి 30 రోజుల్లోగా అనుమతులు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన 'రెడీ టూ స్కిల్ వర్క్ ఫోర్స్'ను అందిస్తున్నామన్నారు. పెట్టుబడులకు మాత్రమే కాదు, సాంకేతికత, పరిశోధన, తయారీ, నైపుణ్యాభివృద్ధిలో అమెరికాకు ఒక నమ్మకమైన దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామిగా నిలిచేందుకు 'తెలంగాణ' సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, అడ్వాన్స్డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్ టెక్నాలజీ తదితర రంగాల్లో అమెరికా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు.

# తేజస్వి ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ డీఎన్ఏ ఉన్న ప్రతి ఒక్కరూ ఈ వ్యాఖ్యలను ఖండించాలని పొన్నం పిలుపునిచ్చారు. రాష్ట్ర గౌరవాన్ని కించపరిస్తే తెలంగాణ బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉంటున్నారు? అని ఆయన నిలదీశారు. తెలంగాణ ఏర్పాటు అనేది దశాబ్దాల పోరాటమని, వేలాది మంది త్యాగాల ఫలితమని, దానిని విద్వేషపూరిత విభజనతో పోల్చడం రాజ్యాంగాన్ని కించపరచడమేనని మండిపడ్డారు. తేజస్వి సూర్యకు తెలంగాణ చరిత్రపై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. ఒక జాతీయ పార్టీకి చెందిన ఎంపీ ఇంత బాధ్యతారాహిత్యంతో మాట్లాడటం సరికాదని హితవు పలికారు.

# డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం జరగదు

**మొదటిపేజీ తరువాయి**

ఉపయోపడుతుందన్నారు. మనం తీసుకోబోయే నిర్ణయాన్ని మహిళలు వీక్షిస్తున్నారని, మన ఉద్దేశాలను కూడా గమనిస్తున్నారన్నారు.మహిళా రిజర్వేషన్ ప్రక్రియను మరింత ఆలస్యం చేయవద్దు అన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లులతో ఏ రాష్ట్రాక్రి అన్యాయం జరగదు అని, ఎవర్నీ వివక్షపూరితంగా చూడబోమన్నారు. అలాగే దక్షిణాదికి అన్యాయం అంటున్న వాదనలో కూడా వాస్తవం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో తనకు క్రెడిట్ అవసరం లేదని మోదీ అన్నారు. ఒకవేళ బిల్లు పాసైన తర్వాత.. ఎవరైనా కావాలంటే వారి పేరు, ఫోటో మీద ఫుల్ పేజీ యాడ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అందరి అచీవ్‌మెంట్‌గా చూడాలన్నారు. ఇది ఏ ఒక్క వ్యక్తి, లేదా రాజకీయ పార్టీకి చెందిన సక్సెస్ కాదన్నారు. కానీ ఒకవేళ మూడు దశాబ్దాల తర్వాత కూడా ఈ సంస్కరణ చేపట్టకపోతే, అప్పుడు ఆ లబ్ధి ఏ పార్టీకి దక్కదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించేవారు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకుంటారన్నారు. డీలిమిటేషన్ అంశంలో గ్యారెంటీ ఇవ్వనున్నట్లు ప్రధాని తెలిపారు. గ్యారెంటీ, ప్రామిస్ పదాలు వాడమంటే వాడుతానని, ఒకవేళ తమిళంలో దీనికి తగిన పదం ఏదైనా ఉందంటే దాన్ని కూడా చెబుతానని, మన ఉద్దేశం స్వచ్ఛమైందైతే, అప్పుడు పదాలతో ఆడాల్సిన అవసరం ఉండదని ఆయన అన్నారు. దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని ఈ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. కాలానుగుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్తవానికి ఈ బిల్లును 30 ఏళ్ల క్రితమే ఆమోదించాల్సిందని చెప్పుకొచ్చిన ఆయన.. ఇది దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు అని అభిప్రాయపడ్డారు.

ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంట్‌కు ఓ కీలక సువర్ణావకాశమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని చెప్పుకొచ్చారు. పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయని వ్వండని.. ఆ తర్వాత ఓబీసీ, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దామని పార్లమెంట్ వేదికగా మోదీ కోరారు. 'పార్లమెంట్‌పై నాకు నమ్మకం ఉంది. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది. తప్పకుండా ఓబీసీలకు న్యాయం చేస్తాం. మహిళా రిజర్వేషన్‌కు రాజకీయ రంగు పులమొద్దు. ఈ బిల్లు రాజకీయ పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే అంటూ.. రిజర్వేషన్లు మహిళల హక్కు. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్టవుతుంది. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు. 'దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా మాకు లేదు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై నాకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ శుక్రవారం ప్రకటన చేస్తా. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు' అని మోదీ తన ప్రసంగంలో వివరించారు. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు అని మోదీ వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికల్లో వీటిని అమలు చేద్దామని మేం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 2029 ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వకపోతే మహిళలకు అన్యాయం చేసినట్లేనని అన్నారు. బిల్లును తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ మాట్లాడుతున్నారు. అలాంటి వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం అని మోదీ స్పష్టం చేశారు.

# కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

**ఏప్రిల్ 16(జర్నలిస్ట్ వార్త);**

కర్ణాటక రాష్ట్రం చిక్కమంగళూరు జిల్లా తరికెరె తాలూకా ఉదయపుర గ్రామానికి చెందిన సుమారు 21 మంది మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనానికి బొలెరో వాహనంలో వస్తున్నారు. వీరి వాహనాన్ని మంత్రాలయం నుండి ఎమ్మిగనూరు వైపు వెళ్తున్న ఫ్లైయాష్ లారీ (రెడీ మిక్స్ ట్యాంకర్) బలంగా ఢకొఏంది. దీంతో, బొలెరో బోల్తా పడి ఆ వాహనంలోని ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో ముగ్గురు మరణించారు. మృతుల్లో కుమార్ (60), దీపిక వీణ (35), సునీల్ (40), బెల్లి (3), పుట్టమ్మ (60), మీనాక్షి (50), తాయమ్మ అలియాస్ యశోద (60), లోలాక్షి (55) ఉన్నారు. తీవ్రంగా గాయపడిన మరో 13 మంది ప్రస్తుతం కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనా స్థలాన్ని కర్నూలు జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ సందర్శించారు. ప్రమాదానికి



కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచి వేసిందని చెప్పారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిఐ ఎం.దస్తగిరిబాబు, ఎస్ఐ మల్లికార్జున తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

**మోడీ దిగ్భ్రాంతి- మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి పరిహారం ప్రకటన**

ఈ ప్రమాద ఘటనపై ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున నష్టపరిహారాన్ని ప్రకటించారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఈ మొత్తాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.

**బాధితులకు మెరుగైన వైద్యమందించాలి : మంత్రి టిజి భరత్**

రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను టిజి భరత్ గుప్తా ఆదేశించారు. కర్నూలు జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న రోడ్డు ప్రమాద బాధితులను ఆయన పరామర్శించారు. మంత్రాలయం జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్స్ గుర్తించి మున్ముందు ఈ తరహా ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

# ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది: ట్రంప్

**ఏప్రిల్ 16(జర్నలిస్ట్ వార్త);**

మధ్యప్రాచ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య 10 రోజుల పాటు కాల్పుల విరమణ (సీజ్‌ఫైర్) ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ ఒప్పందం గురువారం సాయంత్రం 5 గంటల (అమెరికా కాలమానం ప్రకారం) నుంచి అమల్లోకి వస్తుందని ఆయన తెలిపారు.ఈ మేరకు తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. "లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ అవున్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో నేను అద్భుతమైన సంభాషణలు జరిపాను. ఇరు దేశాల మధ్య శాంతి కోసం 10 రోజుల కాల్పుల విరమణకు వారు అంగీకరించారు" అని ట్రంప్ వివరించారు. ప్రపంచవ్యాప్తంగా తాను పరిష్కరించిన పదో యుద్ధం ఇదని ట్రంప్ పేర్కొన్నారు. "ఇప్పటికే 9 యుద్ధాలను పరిష్కరించడం గౌరవంగా భావిస్తున్నా. ఇది నా పదో యుద్ధం. కాబట్టి దీన్ని పూర్తి చేద్దాం" అని ఆయన వ్యాఖ్యానించారు.ఇటీవల ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ మధ్య తిరిగి ఘర్షణలు మొదలైన సంగతి తెలిసిందే. ఈ యుద్ధంలో 2,000 మందికి పైగా మరణించగా, లెబనాన్‌లో లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. ఈ నేపథ్యంలో, 34 ఏళ్ల తర్వాత తొలిసారిగా ఇజ్రాయెల్, లెబనాన్ అధికారులు వాషింగ్టన్‌లో నేరుగా సమావేశమై చర్చలు జరిపారు. 1983 తర్వాత ఇరు దేశాల మధ్య జరిగిన అర్థవంతమైన చర్చలు ఇవేనని ట్రంప్ తెలిపారు.

ఇజ్రాయెల్, లెబనాన్ రెండు దేశాలూ శాంతిని కోరుకుంటున్నాయని, ఈ సమస్య త్వరగా పరిష్కారమవుతుందని తనకు నమ్మకం ఉందని ట్రంప్ అన్నారు. శాంతి చర్చల కోసం ఇరు దేశాల నేతలను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ చర్చల్లో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో పాలుపంచుకుంటారని పేర్కొన్నారు. ఈ కాల్పుల విరమణ మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలను తగ్గించడానికి దోహదపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఏపీకి 38, తెలంగాణకు 26

## డీలిమిటేషన్‌పై అమిత్ షా కీలక ప్రకటన

## లోక్‌సభ స్థానాల పునర్విభజనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా హామీ

**ఏప్రిల్ 16(జర్నలిస్ట్ వార్త);**

లోక్‌సభ స్థానాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియపై దక్షిణాది రాష్ట్రాలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం లోక్‌సభలో కీలక ప్రకటన చేశారు. డీలిమిటేషన్ తర్వాత దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ సీట్లు తగ్గవని, పైగా సంఖ్యాపరంగా, నిష్పత్తి పరంగా కూడా పెరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కి పెరుగుతాయని నిర్దిష్ట లెక్కలతో సహా వివరించారు.మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా అమిత్ షా మాట్లాడారు. లోక్‌సభ మొత్తం సీట్ల సంఖ్యను పెంచిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల సీట్లు కూడా పెరుగుతాయని తెలిపారు. కర్ణాటకలో 28 నుంచి 42కి, తమిళనాడులో 39 నుంచి 59కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయన్నారు. ప్రస్తుతం 543 సీట్లున్న లోక్‌సభలో ఐదు దక్షిణాది రాష్ట్రాలకు 129 స్థానాలు (23.76 శాతం) ఉండగా, సభ విస్తరణ తర్వాత 195 స్థానాలకు (సుమారు 23.97 శాతం) పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ఈ అంశంపై ప్రజల్లో అనవసర భయాలు సృష్టిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆయన విమర్శించారు.లోక్‌సభ సీట్ల సంఖ్యను దాదాపు 816 నుంచి 850కి పెంచి, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. అయితే, జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజన చేపడితే, జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన తమకు అన్యాయం జరుగుతుందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీనివల్ల పార్లమెంటులో తమ ప్రాతినిధ్యం, ప్రాధాన్యత తగ్గుతుందని వాదిస్తున్నాయి.ఈ అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాలన్నీ ఏకతాటిపైకి రావాలని, జనాభాతో పాటు రాష్ట్రాల స్థూల దేశీయోత్పత్తి (జీఎస్డీపీ) వంటి ఆర్థిక సూచికలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. మరోవైపు, ఈ బిల్లును ప్రస్తుత రూపంలో ఆమోదిస్తే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తెలిపారు. మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం మాట్లాడుతూ, తొలుత సీట్లు పెరిగినట్లు కనిపించినా, భవిష్యత్తులో జరిగే డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రస్తుతానికి ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని, అన్ని రాష్ట్రాల సీట్లు పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ చర్చల నేపథ్యంలో, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే విషయంపై ఉత్కంఠ నెలకొంది.

# దేశవ్యాప్తంగా మండుటెండలు

**మొదటిపేజీ తరువాయి**

ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. వడగాల్పుల కారణంగా జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ ప్రజలకు కీలక సూచనలు చేసింది. వడదెబ్బలు తగిలే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ గురువారం ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టింది. ఆ పోస్టులో.. 'ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడగాడ్పులు తీవ్రతరం అవుతున్నాయి. వడదెబ్బల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండండి. వీలైనంత ఎక్కువ నీళ్లు తాగండి. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో కష్టమైన పనులు చేయకండి. లైట్ కలర్ దుస్తులు ధరించండి. తరచుగా విశ్రాంతి తీసుకుంటూ ఉండండి. వడదెబ్బ తగిలితే .. వెంటనే ఆ వ్యక్తిని చల్లని ప్రదేశానికి తరలించండి. నేలపై పడుకోబెట్టండి. నీళ్లలో తడిపిన బట్టను కప్పండి. చల్లని నీళ్లు తాగించండి. నీటి శాతం ఎక్కువగా ఉన్న ఆహారపదార్థాలను అతడికి తినిపించండి' అని సూచించింది. ఏప్రిల్ 20వ తేదీ వరకు తెలంగాణ, రాయలసీమ, మధ్య మహారాష్ట్ర, మరాఠ్వాడా, ఉత్తర కర్ణాటక, మధ్య ప్రదేశ్, విదర్భ, ఒడిశా, జార్ఖండ్, వెస్ట్ రాజస్థాన్‌లలో అత్యంత తీవ్రంగా వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. కేరళ, తమిళనాడు, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని సముద్ర తీర ప్రాంతాల్లో వేడి, పొడి వాతావరణ పరిస్థితులు ఉంటాయని వెల్లడించింది.

## ఎంపియుపియస్ రంగాపురం పాఠశాల

# పంతుళ్లు సమయానికి రారు

**బయ్యారం/,ఏప్రిల్ 16.(జర్నలిస్ట్ వార్త)**

బయ్యారం మండలం జగ్గుతండ గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో సుమారు 110 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలలో తొమ్మిది మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. కానీ ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు పాఠశాలకు సమయపాలన పాటించకపోవడంతో వారికి వారే యమునా తీరం అన్నట్టుగా ఉంది పరిస్థితి. ఈ ఉపాధ్యాయులు ఏ ఒక్క రోజు కూడా సమయానికి పాఠశాలకు హాజరు కావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గురువారం ఉదయం పాఠశాల ప్రార్థనలో తొమ్మిది మంది ఉపాధ్యాయులకు ఐదుగురు మాత్రమే హాజరు అయ్యారు. మిగతా నలుగురు హాజరు అవ్వలేదు. హాజరు కానీ వారిలో ప్రధానోపాధ్యాయులు బానోత్ లింగ్యా, రాంబాబు, కుమారి, లక్ష్మి నారాయణ వీరు ప్రార్థన సమయంలో పాఠశాలలో లేరు. ఈ పాఠశాలలో పని




చేసే పంతుళ్ళు వరంగల్, ఖమ్మం నుండి ట్రైన్ సమయానికి పాఠశాలకు వస్తూ పోతు ఉంటారు.. కానీ పాఠశాల సమయపాలన మాత్రం పాటించరు.. ముఖ్యంగా ప్రధానోపాధ్యాయులు బానోత్ లింగ్యా వీరు పాఠశాలకు రారు, తోటి ఉపాధ్యాయులు సమయానికి రాకున్నా పట్టించుకోరు.. దీనిని బట్టి చూస్తే ఉపాధ్యాయులు ఏ రోజు కూడా పాఠశాల సమయపాలన పాటించడం లేదనేది నిర్ధారణ అవుతుంది.


**-ఉపాధ్యాయులు తీరుపై విద్యార్థుల తల్లిదండ్రుల అసహనం..**

జగ్గుతండ పాఠశాలలో ఉపాధ్యాయులు సమయానికి రారని మీడియా ద్వారా ఉన్నత అధికారులకు తెలిసేలా చూడాలని మీడియా ప్రతినిధుల ముందు వాపోయారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా ఉండటం మూలంగానే ప్రవేటు పాఠశాల వైపు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారని ఉపాధ్యాయులు పాఠశాలకు సమయానికి వచ్చి విద్యార్థులు విద్య నేర్పాలని గ్రామస్తులు కోరుతున్నారు. జగ్గుతండ గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హెచ్ఎంతో పాటు మిగతా ఉపాధ్యాయులు అందరూ కూడా సమయపాలన పాటించడం లేదని, గురువారం ఉదయం మీడియా సభ్యులు పాఠశాలను సందర్శించిన సందర్భంగా ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలకు రావడం లేదన్న విషయం వెలుగులోకి వచ్చింది. పాఠశాలకు సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుకుంటున్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

### సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### తిమ్మాపూర్ సర్పంచ్ ముప్పు మానస మహేందర్



**ఎల్కతుర్తి,/ఏప్రిల్ 16 (జర్నలిస్ట్ వార్త):** పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణ లక్ష్మి పథకం వరంగా మారిందని తిమ్మాపూర్ సర్పంచ్ ముప్పు మానస మహేందర్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రసాద్‌రావు సమక్షంలో కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వడ్లకొండ సులోచన, గూడెం శ్రీలతలకు చెక్కులు అందజేశారు. అనంతరం ముప్పు మానస మహేందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనను కొనసాగిస్తూ సంక్షేమ పథకాలను విస్తృతంగా అమలు చేస్తోందన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.
హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని తమ జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని సూచించారు.

# సొమ్లానాయక్‌కు నివాళులర్పించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్



**కల్లూరు/, ఏప్రిల్ 16 (జర్నలిస్ట్ వార్త):**
మండల పరిధిలోని బోడిమల్లె గ్రామానికి చెందిన కునుసోతు సొమ్లానాయక్ ఇటీవల మృతి చెందగా, గురువారం నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమానికి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె సొమ్లానాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజ, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి, స్థానికులు వెంకట్రావు, కృష్ణ, నారపోగు ప్రసాద్ బాబు, మారేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై మండల స్థాయి సమావేశం





**భీమదేవరపల్లి/ఏప్రిల్16 (జర్నలిస్ట్ వార్త):**
మండలం ముల్కనూర్‌లోని శ్రీ సాయి ఫంక్షన్ హాల్‌లో గురువారం ఎంపిడివో వీరేశం అధ్యక్షతన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశం సందర్భంగా గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారికి పథకాల ప్రయోజనాలు అందేలా గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అలాగే గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, విద్య, ఆరోగ్య రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం కొనసాగించాలని తెలిపారు. ఈ సమావేశం ద్వారా గ్రామాల అభివృద్ధి దిశగా సమగ్ర ప్రణాళికలు రూపొందించి, ప్రభుత్వం లక్ష్యాలను సాధించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సేవకుడు లతీఫ్‌కు సత్కారం



**వైరా/, ఏప్రిల్ 16 (జర్నలిస్ట్ వార్త):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమాజ సేవకుడు షేక్ లతీఫ్‌కు ఘన సత్కారం నిర్వహించారు. గరికపాడు ప్రధానోపాధ్యాయులు డి. సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లతీఫ్ సేవలను కొనియాడుతూ శాలువాతో సత్కరించారు. పదవ తరగతి విద్యార్థులను గరికపాడు ఉన్నత పాఠశాల నుండి పరీక్షా కేంద్రాలకు ప్రతిరోజూ తన స్వంత ఆటోలో ఉచితంగా తీసుకెళ్లి, పరీక్షల అనంతరం సురక్షితంగా తిరిగి ఇళ్లకు చేర్చడం ద్వారా లతీఫ్ చేసిన సేవలు ప్రశంసనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థులను తన సొంత పిల్లలుగా భావించి చేసిన ఈ సేవకు పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తానని లతీఫ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో సమీక్ష

### విద్యాభివృద్ధికి కీలక చర్యలు

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 16, (జర్నలిస్టు వార్త):**
ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ధర్మసాగర్ మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మండల అభివృద్ధి అధికారి అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా, మండల స్థాయి అధికారులు, పలు గ్రామాల సర్పంచులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి డా. రాంధన్ మాట్లాడుతూ, మండలంలోని విద్యా రంగంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఆకలి సమస్యను తగ్గించేందుకు అమలులో ఉన్న మధ్యాహ్న భోజన పథకానికి తోడు ఉదయభోజన పథకాన్ని ప్రారంభించేందుకు చర్యలు



తీసుకుంటున్నట్లు చెప్పారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో ధర్మసాగర్ మండలానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసే అవకాశముందని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను పెంపొందించేందుకు వేసవి శిబిరాలు, విహారయాత్రలు, సైన్స్ మేళాలు, క్రీడా కార్యక్రమాలు, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బడిబాట' కార్యక్రమం ద్వారా వచ్చే విద్యా




సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు . పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, ధర్మప్రకాశ్, నవనీత కుమార్ పాల్గొన్నారు.

# ఎసిబికి చిక్కిన విద్యుత్ ఎడిఇ

### 30వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

**నల్గొండ,ఏప్రిల్ 16 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలో ప్రతిరోజు అవినీతి అధికారులు ఏసీబీకి పట్టుబడుతున్నారు. తాజాగా నల్గొండ జిల్లా దేవరకొండ ఏడీఈ సిరికొండ సైదులు గురువారం బాధితుడు నుంచి రూ. 30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కాడు. గత సంవత్సరం కంబాలపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌పై పిడుగుపడి మరమ్మతులకు గురైంది. మరమ్మతులకు అయిన రూ. 10 లక్షల బిల్లుల కోసం అధికారిని సంప్రదించగా లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు నల్గొండ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి నుంచి రూ. 30 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకుని, కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు.

----------

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతుగా సంతకాల సేకరణ

### బీజేపీ ఆధ్వర్యంలో ముమ్మరంగా కార్యక్రమం





**సత్తుపల్లి, /ఏప్రిల్ 16 (జర్నలిస్టు వార్త):**
మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతుగా సత్తుపల్లి పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు బాణావత్ విజయ్ నాయకత్వంలో మహిళల నుంచి విస్తృతంగా సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు మాట్లాడుతూ, సమాజంలో మహిళలకు ఉన్నత స్థానం కల్పించడం అవసరమని పేర్కొన్నారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా వారి నిర్ణయాధికారం పెరుగుతుందని, ఇది మహిళా సాధికారతకు దోహదపడుతుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ఆమోదింపజేసిందని, ఇది దేశ చరిత్రలో కీలక ఘట్టంగా నిలుస్తుందని అన్నారు. గత ప్రభుత్వాలు బిల్లును ప్రవేశపెట్టినా అమలు చేయలేకపోయాయని విమర్శించారు. మహిళల వద్దకు వెళ్లి బిల్లుపై అవగాహన కల్పించగా, వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఖమ్మం జిల్లా బీజేపీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శులు మందా శివ, నాగ మౌనిక, స్టేట్ కౌన్సిల్ మెంబర్ జొన్నలగడ్డ నరేష్, సీనియర్ నాయకులు మన్నెని నరసింహమూర్తి, చీకటి వసంతరావు, మాజీ మండలాధ్యక్షులు పాలకొల్లు శ్రీనివాస్, డాక్టర్ పెద్దిరాజు, బట్టి శివ సాయి, సాయి కిరణ్, అక్షయ తదితరులు పాల్గొన్నారు.

# పిఆర్ టీయు సంఘం ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడికి సన్మానం



**బయ్యారం/,ఏప్రిల్ 16.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా మూడో సారి ఏకగ్రీవంగా ఎన్నికైన సంకపల్లి సుమన్ రెడ్డిని గురువారం పిఆర్ టీయు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పిఆర్ టీయు మండల అధ్యక్షులు మోహన్ నాయక్ సుమన్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.సుమన్ రెడ్డి నేతృత్వంలో ప్రెస్ క్లబ్ అభివృద్ధి చెందాలని మోహన్ నాయక్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు నీలారపు సంపత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బిఆర్ఎస్ పార్టీ మండల ప్రెసిడెంట్ తాత గణేష్ జన్మదిన వేడుకలు.



**బయ్యారం/,ఏప్రిల్ 16.(జర్నలిస్ట్ వార్త)**
బిఆర్ఎస్ పార్టీ మండల ప్రెసిడెంట్ తాత గణేష్ జన్మదిన వేడుకలను గురువారం మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.గంధంపల్లిలో తాత గణేష్ ఇంటి వద్ద బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఏర్పాటుచేసిన జన్మదిన వేడుకలో తాత గణేష్ కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు.ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్న పలువురు నాయకులు,కార్యకర్తలు తాత గణేష్ కీ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా బయ్యారం మండల అభివృద్ధికీ తాత గణేష్ అన్న మరిన్ని సేవలందించాలని అజ్మీరా సునీల్ నాయక్,నీలారపు సంపత్ యాదవ్,కీర్తి ఉదయ్ కోరుకుంటున్నట్లు తెలిపారు.

# రేప్ కేసులో నలుగురు నిందితులు అరెస్ట్.. రిమాండ్



**భీమదేవరపల్లి/ఏప్రిల్16 (జర్నలిస్ట్ వార్త):** మండలం ముల్కనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రేప్ కేసులో నలుగురు నిందితులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ఎల్కతుర్తి జంక్షన్ వద్ద వీరిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. మల్లారం గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు శివతో పాటు అతనికి సహకరించిన మణికంఠ, వేణు, టోనీ అలియాస్ గణేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి కేసులో ఉపయోగించిన ద్విచక్ర వాహనం మరియు మూడు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టులను కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సిఐ రమేష్ పర్యవేక్షణలో చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.


# హార్ట్ ఎటాక్‌తో మహిళ మృతి



**ఎల్కతుర్తి,/ ఏప్రిల్ 16 (జర్నలిస్ట్ వార్త):**
మండలంలోని సూరారం గ్రామానికి చెందిన గాజుల మార్తా హార్ట్ ఎటాక్‌తో మృతి చెందడం గ్రామంలో విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనపై గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మృతురాలు పేద కుటుంబానికి చెందినవారని, ఆమె తండ్రి గాజుల మల్లయ్య స్వాతంత్ర్య సమరయోధుడిగా ఆంగ్లేయులపై పోరాడిన చరిత్ర ఉందని స్థానికులు గుర్తుచేశారు. మార్తా మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరు మున్నీరుగా విలపించారు.మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామస్తులు ప్రార్థించారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, మాజీ వైస్ ఎంపీపీ తంగేడు నగేశ్, సర్పంచ్ నీల తదితరులు ఉన్నారు.

# రాజ్యసభ సభ్యుడిగా వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం.

## -శుభాకాంక్షలు తెలిపిన ఇల్లందు ఎమ్మెల్యే.



**బయ్యారం/,ఏప్రిల్ 16.(జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వేం నరేందర్ రెడ్డి గురువారం రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు.అనంతరం వేం నరేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ,తన మీద నమ్మకంతో రాజ్యసభ ఎంపీగా అవకాశం ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలిపారు.తెలంగాణ ప్రజలు, సమస్యలు,రాష్ట్ర హక్కులు,రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి పార్లమెంటులో పోరాటం చేస్తామని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రజల వికాసం, అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.ప్రమాణ స్వీకార అనంతరం ఢిల్లీ తెలంగాణ భవన్ లో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్,ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు ఎంపి వేం నరేందర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# స్టేట్ 2వ ర్యాంక్ సాధించిన విద్యార్థినికి ఘన సత్కారం

## కష్టపడితేనే విజయాలు సాధ్యం: మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



**దమ్మపేట/, ఏప్రిల్ 16 (జర్నలిస్ట్ వార్త):** ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో దమ్మపేట మండలానికి చెందిన ఓ విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో మెరిసింది. మండలంలోని నాయుడుపేట గ్రామానికి చెందిన మల్లిశెట్టి రాంబాబు కుమార్తె మల్లిశెట్టి ధనతేజస్విని ఇంటర్ మొదటి సంవత్సరం (బైపిసి)లో 440 మార్కులకు గాను 438 మార్కులు సాధించి రాష్ట్రంలో ద్వితీయ ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. ఆమె అశ్వారావుపేటలోని వి.కె.డి.వి.ఎస్ ప్రైవేట్ కళాశాలలో విద్యనభ్యసిస్తోంది.ఈ సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు విద్యార్థినిని శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు కూడా పట్టుదల, కృషితో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ధనతేజస్విని నిరూపించిందన్నారు. ఆమె విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ప్రధాన కారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొని విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

# ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో ఫుడ్ స్టాల్ సందర్శన

## అధికారుల సమీక్ష సమావేశం



**నర్సంపేట/, ఏప్రిల్ 16 (జర్నలిస్ట్ వార్త):**



ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నర్సంపేట పట్టణంలోని రైతు వేదికలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో ఉమారాణి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు చేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆమె తెలిపారు. సమావేశంలో మండల ప్రజా పరిషత్ స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఎమ్మార్వో, ఎంఈఓ, పోలీస్ అధికారులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొని తమ తమ విభాగాల కార్యక్రమాలను వివరించారు.అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్‌ను ఆర్డీవోతో పాటు అధికారులు సందర్శించి, అందిస్తున్న పోషకాహార అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఎమ్మార్వో, ఎంఈఓ సారయ్య, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు పారిజాతం, అరుణ, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


# ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో ఫుడ్ స్టాల్ సందర్శన

## అధికారుల సమీక్ష సమావేశం


**నర్సంపేట,/ ఏప్రిల్ 16 (జర్నలిస్ట్ వార్త):**



ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నర్సంపేట పట్టణంలోని రైతు వేదికలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో ఉమారాణి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు చేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజల్లో అవగాహన పెంపు ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో మండల ప్రజా పరిషత్ స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఎమ్మార్వో, ఎంఈఓ, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని తమ తమ విభాగాల పనితీరును వివరించారు.అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్‌ను ఆర్డీవోతో పాటు అధికారులు సందర్శించి, అందిస్తున్న పోషకాహారంపై వివరాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఎమ్మార్వో, ఎంఈఓ సారయ్య, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు పారిజాతం, అరుణ, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల్లో పనిచేసిన వారికి రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలి

## డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్




**ఎల్కతుర్తి,/ఏప్రిల్ 16 (జర్నలిస్ట్ వార్త):**
గ్రామపంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఇప్పటికీ రెమ్యూనరేషన్ చెల్లించకపోవడంపై డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) ఆగ్రహం వ్యక్తం చేసింది. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంపీడీవో ఎన్. విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా డిటిఎఫ్ అధ్యక్షుడు ఎం. వెంకటయ్య (గోపాల్పూర్) మాట్లాడుతూ, 2025 డిసెంబర్‌లో నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు దాదాపు పది రోజులపాటు విధులు నిర్వహించినప్పటికీ ఇప్పటివరకు వారికి రెమ్యూనరేషన్ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి దృష్టికి కూడా తీసుకెళ్లామని తెలిపారు. ఎన్నికల విధుల్లో పనిచేసిన ఉపాధ్యాయులకు తక్షణమే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.
ఇంకా ఆలస్యం చేస్తే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. బాధిత ఉపాధ్యాయులు తమ సమస్యను పరిష్కరించాలని మీడియా ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా రేపు రెవెన్యూ ఉద్యోగుల నల్ల బ్యాడ్జీల ప్రదర్శన

## 5 డిఏలు, పిఆర్సి బకాయిలు వెంటనే విడుదల చేయాలి

## నాయబ్ తహశీల్దార్ పదోన్నతుల్లో మెయింటెనెన్స్ టెస్ట్ రద్దు చేయాలి

## హనుమకొండ జిల్లా ట్రెంగ అధ్యక్షులు మరుపట్ల మల్లయ్య పిలుపు

**హనుమకొండ/ఏప్రిల్ 16(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ నేడు (శుక్రవారం) జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగ) హనుమకొండ జిల్లా అధ్యక్షులు మరుపట్ల మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు.భోజన విరామ సమయంలో ఉద్యోగులందరూ నల్ల రిబ్బన్లు ధరించి తమ నిరసనను తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా తెలంగాణలో ఉద్యోగుల హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. **మా ప్రధాన డిమాండ్లు**
బకాయిల చెల్లింపు: జనవరి 2024 నుండి పెండింగ్‌లో ఉన్న 5 డిఏ లను వెంటనే విడుదల చేయాలి. అలాగే 2023 నుండి రావాల్సిన పి.ఆర్.సి బకాయిలను తక్షణమే ప్రకటించాలి.
పదోన్నతుల సరళీకరణ: నాయబ్ తహశీల్దార్ పదోన్నతుల కోసం నిర్వహిస్తున్న మెయింటెనెన్స్ టెస్టును రద్దు చేయాలి. ఇప్పటికే సర్వే ట్రైనింగ్ పూర్తి చేసుకున్న సీనియర్ అసిస్టెంట్లు, గిర్దావర్ల సర్వీసును పరిగణనలోకి తీసుకుని ప్రమోషన్లు కల్పించాలి. ఆరోగ్య భద్రత: ఉద్యోగులు, పెన్షనర్లకు కాంట్రిబ్యూషన్ లేకుండా కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందించాలి.
ఆర్థిక ప్రయోజనాలు: జి.పి.ఎఫ్ లోన్లు, పదవీ విరమణ పొందిన వారికి రావాల్సిన బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి. బకాయిలు అందక రిటైర్డ్ ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు.
ఇతర డిమాండ్లు: సి.పి.ఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి. జి.ఓ 317 బాధితులను సొంత జిల్లాలకు పంపాలి. విఆర్ఏ వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.
మనం దాచుకున్న జిపిఎఫ్ డబ్బుల కోసం కూడా వేచి చూడాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరం. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు తీరే వరకు మా పోరాటం ఆగదని, నేడు జరిగే నిరసన కార్యక్రమంలో రెవెన్యూ సోదరులందరూ పాల్గొని జయప్రదం చేయాలని , జిల్లా అధ్యక్షులు, ట్రెంగ.మరుపట్ల మల్లయ్య పిలుపునిచ్చారు.

# మంచినీళ్ల సాకుతో వచ్చి.. వృద్ధురాలి గొలుసు అపహరణ

## గీసుగొండలో తెగబడ్డ దొంగ -కేసు నమోదు చేసిన పోలీసులు

**గీసుగొండ/ఏప్రిల్ 15(జర్నలిస్ట్ వార్త):**



దాహం వేస్తోందంటూ నమ్మబలికి ఓ వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెల తాడును అపహరించిన ఘటన గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల , దుగ్గొండి మండలం మహమ్మదపురం గ్రామానికి చెందిన పాలడుగుల నరసమ్మ, చంద్రయ్య దంపతులు ఈ నెల 12వ తేదీన సూర్య తండాలోని తమ కుమార్తె తాళ్లపల్లి కవిత కొత్త ఇంటి గృహప్రవేశం నిమిత్తం వచ్చారు. కార్యక్రమం ముగిసిన అనంతరం వారు అక్కడే ఉంటున్నారు.బుధవారం (తేదీ: 15) నరసమ్మ కుమార్తె, అల్లుడు వ్యక్తిగత పనులపై బయటకు వెళ్లారు. ఈ క్రమంలో నరసమ్మ, ఆమె భర్త ఇంటి ముందు కూర్చుని ఉండగా.. గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై అక్కడికి వచ్చాడు. బైక్ నిలిపి, తనకు మంచినీళ్లు కావాలని నరసమ్మను కోరాడు. ఆమె నీళ్లు ఇచ్చే ప్రయత్నం చేస్తుండగా, ఒక్కసారిగా మెడలోని బంగారు పుస్తెల తాడును తెంచుకుని వేగంగా వాహనంపై పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై సీఐ డి. విశ్వేశ్వర్ స్పందిస్తూ నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టామని, త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. పరిచయం లేని వ్యక్తులు మంచినీళ్లు లేదా అడ్రస్ అడిగే సాకుతో వస్తే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు

## ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్




**నర్సంపేట, /ఏప్రిల్ 16 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సంపేట (అటానమస్)లో డిగ్రీ ప్రవేశాల కోసం జిల్లా స్థాయి దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించే దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) ద్వారా డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

వరంగల్ జిల్లాలోనే అటానమస్ హోదా కలిగిన ప్రతిష్టాత్మక ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా నర్సంపేట కళాశాల ప్రత్యేక గుర్తింపు పొందిందని, అన్ని సౌకర్యాలతో పాటు ప్రతిభావంతులైన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచందర్ మాట్లాడుతూ, డిగ్రీ ప్రవేశాల ఆన్‌లైన్ ప్రక్రియలో విద్యార్థులకు ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. దోస్త్ మొదటి విడత దరఖాస్తుల గడువు మే 8 వరకు ఉండగా, రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజుతో నమోదు చేసుకోవచ్చన్నారు. వెబ్ ఆప్షన్లు ఈ నెల 30 నుంచి మే 8 వరకు నమోదు చేయవచ్చని తెలిపారు.

మొదటి విడత సీట్ల కేటాయింపు అనంతరం మే 15 నుంచి 23 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని, రెండో విడత రిజిస్ట్రేషన్లు మే 15 నుంచి 25 వరకు రూ.400 ఫీజుతో నిర్వహించనున్నట్లు చెప్పారు. రెండో విడతలో సీట్లు పొందిన వారు మే 31 నుంచి జూన్ 5 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని వివరించారు.మూడో విడత రిజిస్ట్రేషన్ మే 31 నుంచి జూన్ 15 వరకు కొనసాగుతుందని, సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 20 నుంచి 25 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. మూడు విడతల్లో సీట్లు పొందిన విద్యార్థులందరూ జూన్ 20 నుంచి కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుందని, జూలై 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డు మొబైల్ నంబర్‌కు అనుసంధానం అయి ఉండాలని, పదో తరగతి మెమో, ఇంటర్ హాల్ టికెట్ నంబర్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (01-04-2026 తర్వాత జారీ చేయబడినవి), స్టడీ సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో వంటి పత్రాలు అవసరమని తెలిపారు. కళాశాల హెల్ప్ సెంటర్‌లో ఉచితంగా దోస్త్ రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బైరి సత్యనారాయణ, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కందాల సత్యనారాయణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్ కమలాకర్, అడ్మిషన్ ఇన్‌చార్జ్ డాక్టర్ బద్రు, డాక్టర్ రాంబాబు, డాక్టర్ సోమయ్య, డాక్టర్ రాజీరు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యం

## : చైర్మన్ సారంగపాణి

### మున్సిపల్ కార్యాలయంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' సమీక్ష






**వర్ధన్నపేట, ఏప్రిల్ 16(జర్నలిస్ట్ వార్త):ఐ** ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు క్షేత్రస్థాయిలో ప్రతి పౌరుడికీ అందేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ఆదేశించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని తక్షణ పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. పట్టణంలో శానిటేషన్, తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించవద్దని, పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దగలమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డి.ఆర్.డి.ఓ రేణుక దేవి, మున్సిపల్ కమిషనర్ ఇమ్మడి సుధీర్ కుమార్, కౌన్సిలర్లు బెజ్జం పాపరావు, బానోతు జ్యోతి, గుజ్జ వీర రాఘవ రావు, మాలోతు దేవేందర్, తుమ్మల అరుణ, తిరుపెల్లి వాణి , అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాల భాగస్వాములే కావాలి

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

## వచ్చే ఏడాదికల్లా క్షయ రహిత జిల్లా లక్ష్యం

## కలెక్టర్ చాహత్ బాజ్ పాయి







**ఎల్కతుర్తి,/ ఏప్రిల్ 16 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రజలంతా భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఎస్ఎంఆర్ ఫంక్షన్ హాలులో "ప్రజాపాలనప్రగతి ప్రణాళిక"లో భాగంగా నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు సమర్థవంతంగా అమలు అవుతున్నాయని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. నిర్మాణ దశల వారీగా బిల్లులు ప్రతి వారం చెల్లిస్తున్నామని, ఎక్కడా పెండింగ్ లేకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. చింతలపల్లి, ఇందిరానగర్, గుంటూరుపల్లి గ్రామాలు 100 శాతం ప్రగతి సాధించడం అభినందనీయమన్నారు. మిగతా గ్రామాలు కూడా అదే దిశగా కృషి చేయాలని కోరారు. బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సదుపాయాలు కల్పించి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడానికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నపాటి సమస్యలను స్థానిక సర్పంచులు పరిష్కరించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు పూర్తి స్థాయిలో విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు అవసరమైతే పాఠశాలల ఖాళీ గదులను వినియోగించాలని అన్నారు. విలేజ్ న్యూట్రిషన్ డే కార్యక్రమాల ద్వారా గర్భిణీలు, చిన్నారుల్లో పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు.జిల్లాలో ఆశా, ఏఎన్ఎం సిబ్బంది కృషితో క్షయ వ్యాధి కేసులు తగ్గుతున్నాయని పేర్కొంటూ, టిబి రహిత మండలంగా కొనసాగిస్తూ వచ్చే ఏడాదికల్లా జిల్లాను సంపూర్ణ క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు.

"అరైవ్ అలైవ్" కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన పెంచుతున్నామని, గ్రామాల్లో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

గ్రామాల వరకు గంజాయి వ్యాప్తి చెందుతుండటం ఆందోళనకరమని, దానిని నిర్మూలించేందుకు సమిష్టిగా కృషి చేయాలని హెచ్చరించారు.

సమావేశం అనంతరం అంగన్వాడీ చిన్నారులకు దుస్తులు పంపిణీ చేసిన కలెక్టర్, టీచర్లు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, జిల్లా అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రేవంత్ సర్కార్ పాలన

## దమ్మన్నపేటలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' రివ్యూ..

## ముఖ్య అతిథిగా ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య



**వర్ధన్నపేట/ఏప్రిల్ 16(జర్నలిస్ట్ వార్త);** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అధికారులదే కీలక పాత్ర అని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య పేర్కొన్నారు. గురువారం దమ్మన్నపేట గ్రామంలో ఎంపీడీఓ అధ్యక్షతన జరిగిన '99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరగడం రేవంత్ రెడ్డి సర్కార్ పనితీరుకు నిదర్శనమన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ వంటి విప్లవాత్మక నిర్ణయాలతో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. గత పాలకులు విస్మరించిన ఇందిరమ్మ బీమాను రూ. 5 లక్షలకు పెంచి 1.15 కోట్ల మందికి భరోసా కల్పించామన్నారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చొరవతో వర్ధన్నపేటకు 100 పడకల ఆసుపత్రి, రూ. 200 కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్, సబ్ కోర్టు మంజూరయ్యాయని. కొనారెడ్డి చెరువును బాగుచేసి రైతులను ఆదుకున్న ఘనత ఆయనదేనని స్పష్టం చేశారు. మొక్కజొన్న రైతులకు రూ. 2400 మద్దతు ధరతో ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, అసత్య ప్రచారాలు నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణతో ఎల్కుర్తిలో పండుగ వాతావరణం

## అంబేద్కర్ ఆశయాలు ఆచరణలోకి రావాలి ప్రొఫెసర్ కాసిం -రాజ్యాంగం దేశానికి మార్గదర్శి తాటికొండ రాజయ్య



**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 16 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ఎల్కుర్తి గ్రామంలో గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామం మొత్తం పండుగ వాతావరణంలో కళకళలాడింది. ఉదయం నుంచే ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రొఫెసర్ కాసిం మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. సమాజంలో సమానత్వం, సోదరభావం నెలకొల్పడంలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. అంబేద్కర్ చూపిన మార్గం సామాజిక న్యాయం సాధనకు దారి తీస్తుందని, కులమత భేదాలను పక్కనబెట్టి అందరూ ఒక్కటిగా ముందుకు సాగాలని సూచించారు. మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా భారత రాజ్యాంగం నిలిచిందని, అంబేద్కర్ రాజ్యాంగ రచనా కమిటీ అధ్యక్షుడిగా కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం అనే మూల్యాలపై ఆధారపడిన ఈ రాజ్యాంగం ప్రతి పౌరుడికి మౌలిక హక్కులను కల్పించిందని తెలిపారు. అణగారిన వర్గాలకు ప్రత్యేక రక్షణలు, అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక న్యాయాన్ని స్థాపించిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసే విధంగా రాజ్యాంగం రూపుదిద్దుకుందని, కేంద్ర-రాష్ట్రాల మధ్య అధికారాలను స్పష్టంగా విభజించిందని వివరించారు.దేశ సమగ్రతను కాపాడే విధంగా రాజ్యాంగం నిర్మితమైందని, స్వతంత్ర న్యాయవ్యవస్థ ద్వారా న్యాయం సాధ్యమయ్యేలా చేసిన గొప్ప పత్రిక ఇదని కొనియాడారు. 1950 జనవరి 26న అమలులోకి వచ్చిన రాజ్యాంగం భారతదేశానికి కొత్త దిశను చూపిందని పేర్కొన్నారు.కార్యక్రమానికి నిర్వాహక అధ్యక్షులు కొలిపాక రాజు అధ్యక్షత వహించగా, గ్రామ సర్పంచ్, విగ్రహ దాత నరిశెట్టి సుధాకర్, స్థల దాత కొలిపాక ప్రకాశం కలిసి అంబేద్కర్ విగ్రహానికి ముసుగు తొలగించి పూలమాలలు అర్పించారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.విగ్రహ ఆవిష్కరణతో ఎల్కుర్తి గ్రామం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం గ్రామ ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. అన్ని రంగాల్లో అన్నగారిన వర్గాలకు న్యాయం జరగాలంటే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పినట్లు చదువు దారిన సాధ్యమవుతుందని వక్తలు తెలిపారు. ఓటు అనే ఆయుధంతో రాజ్యాధికార దిశగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు

అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మిద్దెపాక ఎల్లయ్య . సీఐ ఒంటేరు రమేష్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితాంతం అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. సమాజంలో సమానత్వం నెలకొల్పడానికి అంబేద్కర్ చేసిన త్యాగాలు, పోరాటాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను అర్థం చేసుకుని ఆచరణలో పెట్టాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.

అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, అయితే ఆ హక్కులను సద్వినియోగం చేసుకుంటేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు విద్యను ఆయుధంగా చేసుకుని ఎదగాలని సూచించారు. చదువుతోనే సామాజిక మార్పు సాధ్యమవుతుందని, యువత అంబేద్కర్ మార్గాన్ని అనుసరించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.కులమత వివక్షలు సమాజ అభివృద్ధికి అడ్డంకులని, వాటిని అధిగమించి సోదరభావంతో జీవిస్తేనే సమాన సమాజం ఏర్పడుతుందని అన్నారు.

ఓటు హక్కు ప్రజలకు ఉన్న గొప్ప శక్తి అని, దాన్ని సరైన విధంగా వినియోగించడం ద్వారా అణగారిన వర్గాలు రాజ్యాధికారాన్ని సాధించగలవని స్పష్టం చేశారు.

ఎల్కుర్తి గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జరగడం సంతోషకర విషయమని, ఇది గ్రామంలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఇంటికీ చేరి, సమాజంలో నిజమైన సమానత్వం నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎం హెచ్ పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మైస ఉపేందర్, జాగృతి నాయకులు చిలుక ప్రవీణ్ ఏలుకుర్తి విగ్రహ కమిటీ మాదాసి రమేష్, కొలిపాక కొమురయ్య, బెరేమధుకర్, సంద్ర శేఖర్, ఇంద కృష్ణ, జోగు చిరంజీవి, కొలిపాక రాజు, గడ్డం లూథియా,గాజుల సదానందం, మాదాసి నవీన్ కుమార్, కొలిపాక అంతోని, మాదాసి కుమార్, కనకం సాయిలు, కొలిపాక సురేష్, కొలిపాక రజనీకాంత్, వస్కుల రమేష్,, మినుముల హరీష్, కొలిపాక కిరణ్ బాబు కొలిపాక యాదగిరి గ్రామస్తులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు







# అంబేద్కర్ ఆశయ సాధనే యువత లక్ష్యం కావాలి



## కట్రియాల లో ఘనంగా బాబాసాహెబ్ 135వ జయంతి వేడుకలు

## -నీలిమయమైన పురవీధులు.. హోరెత్తిన జై భీమ్ నినాదాలు













**వర్ధన్నపేట/ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ వార్త):** కులమనే పునాదిపై మీరు దేన్నీ నిర్మించలేరు. కనీసం నైతికతను కూడా స్థాపించలేరు అన్న బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మాటలు నేటి సమాజానికి దిక్సూచి అని వక్తలు కొనియాడారు. మంగళవారం మండలంలోని కట్రియా గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత 135వ జన్మదినోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కొండేటి భాస్కర్ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలు గ్రామస్తుల్లో నూతన చైతన్యాన్ని నింపింది.

### ఘనంగా ర్యాలీ - నివాళులర్పించిన అతిథులు

వేడుకల్లో భాగంగా గ్రామంలోని అంబేద్కర్ భవనం వద్ద జెండాను ఆవిష్కరించి ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిలు ఎస్సై సాయి బాబు, కేయూ ఏఎస్సీ ప్రెసిడెంట్ మంద వీరస్వామి మాట్లాడుతూ రాజ్యాంగ ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి అందినప్పుడే అంబేద్కర్ కలలు సాకారమవుతాయని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య మాట్లాడుతూ దళిత, అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని కొనియాడారు.కేయూ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పాలకుర్తి రాజేందర్, ముత్యాల భాస్కర్, ముత్యాల బాబు తదితరులు యువతను ఉద్దేశించి ప్రసంగించారు.

### సన్మానాలు.. సేవా దృక్పథం

ఈ కార్యక్రమంలో భాగంగా అతిథులను, సంఘం ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. అనంతరం ముత్యాల పవిత్ర - అఖిల్ దంపతులు, కొండేటి మధుకర్, దుపెల్లి రాజు తదితర దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం అందరి ప్రశంసలు అందుకుంది. ప్రముఖ యూట్యూబ్ గాయకుల గీతాలు సభికులను ఆలోచింపజేశాయి.

### విద్యతోనే విముక్తి: ముత్యాల దీపక్

సమావేశంలో గౌరవ సలహాదారులు ముత్యాల దీపక్ మాట్లాడుతూ యువత ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన చట్టాలపై ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన ఉండాలని, అందుకే ప్రతి ఇంట్లో రాజ్యాంగ పుస్తకం ఉండాలని సూచించారు. ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి చదువు ఒక్కటే మార్గమని, విద్యపై యువత ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని హితవు పలికారు.
ఈ కార్యక్రమంలో కీలక సభ్యులు ఉపాధ్యక్షులు ముత్యాల భాస్కర్, ముత్యాల బాబు, ప్రధాన కార్యదర్శి. సలహాదారులు,ముత్యాల దీపక్, నస్కరి మహేందర్, ఎలుకటి రాజు.పాల్గొన్నవారు: హరీష్, రాజు, రమేష్, వంశీనాథ్, విజయ్, అజయ్, శ్రవణ్, దుపెల్లి అశోక్ తదితర యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విపక్షాల ఐక్యతకు పరీక్షా కాలం

## మహిళా బిల్లుపై పరస్పర విరుద్ధ వాదనలు -ఎన్నికల ప్రచారంలో బిజీగా టిఎంసి ఎంపిలు

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 16(జర్నలిస్ట్ వార్త);** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లుల నేపథ్యంలో విపక్ష కూటమిలో విభేదాలు బయటపడుతున్నట్టు తెలుస్తోంది. అలాగే వారి మధ్య ఐక్యత లేదని స్పష్టం అవుతోంది. బిల్లును వ్యతిరేకిస్తే తమకు పుట్టగతులు ఉండవన్న భయం కూడా వారిని వెన్నాడుతోంది. పార్లమెంట్‌లో ఈ కీలక బిల్లులపై ఓటింగ్‌కు ముందు జరిగిన సమావేశంలో వివిధ పార్టీలు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేయడమే దీనికి కారణం. కేంద్రం తీసుకొస్తున్న ఈ బిల్లుల ద్వారా లోక్‌సభ, అసెంబ్లీలలో మహిళలకు రిజర్వేషన్ అమలును వేగవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే.. ఈ ప్రక్రియను డీలిమిటేషన్‌తో అనుసంధానం చేయడంపై విపక్ష నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ బెంగాల్లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు అందరూ పార్లమెంట్‌కు హాజరుకావడం కష్టమవుతోందని ఆ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యురాలు సాగరికా ఘోష్ తెలిపారు. అయితే.. టీఎంసీ వైఖరిని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుపట్టారు. విపక్ష ఎంపీలు ఓటింగ్‌కు హాజరు కాకపోతే అది ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినట్లే అవుతుందని హెచ్చరించినట్టు సమాచారం. అన్ని పార్టీలు తప్పనిసరిగా హాజరై బిల్లును వ్యతిరేకించాలని ఆయన కోరారు. ఇదిలా ఉండగా.. తమిళనాడులోనూ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నప్పటికీ డీఎంకే ఎంపీలు పూర్తి స్థాయిలో హాజరవుతారని ఆ పార్టీ ప్రతినిధి టీఆర్.బాలు స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాము వ్యతిరేకం కాదని కొందరు విపక్ష నేతలు ఇప్పటికే తమ అభిప్రాయాలను వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఏది ఏమైనా మహిళా రిజర్వేషన్ బిల్లు రాజకీయంగా కొత్త సమీకరణాలకు దారితీస్తుండగా.. విపక్ష ఐక్యతకు ఇది పరీక్ష కాలంగా మారింది. మహిళల రిజర్వేషన్ల అమలు, నియోజకవర్గ పునర్విభజన బిల్లులపై కాంగ్రెస్ నేత సోనియా గాంధీ తాజాగా స్పందించారు. మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు స్పందిస్తూ తమ పార్టీ వైఖరిని ముందే తెలియజేశామని అన్నారు. ఈ విషయంలో అదనంగా తాను చెప్పాల్సిందేమీ లేదని పేర్కొన్నారు.ఇందుకు సంబంధించిన బిల్లులను గురువారం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్‌వాల్, హోం మంత్రి అమిత్‌షా లోక్‌సభ ముందుకు తీసుకొచ్చారు. 131వ రాజ్యంగసవరణ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను మంత్రి మేఘ్‌వాల్ ప్రవేశపెట్టగా, కేంద్రపాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాలకు సంబంధించిన బిల్లును అమిత్ షా సభ ముందు పెట్టారు. బిల్లులను అనుమతించాలా? వద్దా? అన్న అంశంపై ఓటింగ్ జరగ్గా మెజారిటీ సభ్యులు అనుకూలంగా ఓటు వేశారు.

# వేసవి రద్దీకి అనుగుణంగా రైళ్లు

## అనంత మీదుగా యశ్వంతపూర్-జల్పైగురి మధ్య రెండు ట్రైన్స్

**అనంతపురం,ఏప్రిల్ 16(జర్నలిస్ట్ వార్త);** వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని అనంతపురం మీదుగా యశ్వంతపూర్-జల్పైగురి మధ్య రెండు ట్రిప్పుల ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. యశ్వంతపూర్-న్యూ జల్పైగురి ప్రత్యేక రైలు (నం. 06567) ఈనెల 17, 24 తేదీల్లో (శుక్రవారాల్లో) యశ్వంతపూర్‌లో ఉదయం 7 గంటలకు బయలుదేరి మూడోరోజు సోమవారం ఉదయం 7 గంటలకు గమ్యస్థానానికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం.06568) ఈనెల 20, 27 తేదీల్లో (సోమవారాల్లో) న్యూ జల్పైగురి స్టేషన్‌లో ఉదయం 8.30కి బయలుదేరి మూడో రోజైన గురువారం ఉదయం 9.55 గంటలకు బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుత్తి, డోన్, నంద్యాల, మార్కాపూర్ రోడ్, నరసరావుపేట, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, కొత్తవలస, విజయనదరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బ్రహ్మపూర్, బాలుగావ్, ఖుద్రా రోడ్, భువనేశ్వర్, కటక్, జాజ్‌పూర్ కెయోంజహార్ రోడ్, భద్రక్, ఖరగ్‌పూర్, అందుల్, డాన్కుని, బర్ధమాన్, బోల్పూర్ (శాంతినికేతన్), రాంపూర్ హట్, న్యూ ఫరక్కా, మాల్డా టౌన్, కిష్ణాగంజ్ స్టేషన్ల మీదుగా వెళుందన్నారు. ప్రయాణికుల రద్దీ నియంత్రణకు యశ్వంతపూర్-సహార్స మధ్య వయా గుత్తి మూడు ట్రిప్పుల ప్రత్యక వీక్లీ రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సహార్స- యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (నం. 05551)ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకూ గురువారాల్లో రాత్రి 10.25 గంటలకు సహార్సలో బయలుదేరి రెండు రోజుల తర్వాత శనివారం రాత్రి 10.30కి యశ్వంతపూర్‌కు చేరుకుంటుందన్నారు.

# పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన

## పనులను ఎస్ఎమ్‌సీలకు అప్పగించాలి

## స్కూళ్లలో ప్రవేశాల పెంపునకు డోర్ టు డోర్ క్యాంపెయిన్

## మంత్రి నారా లోకేశ్ ఆదేశాలు



**అమరావతిఏప్రిల్ 16(జర్నలిస్ట్ వార్త);** పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పనులను ఎస్ఎమ్‌సీలకు అప్పగించాలని అధికారులను మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలను 3 స్టార్‌కు చేర్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాల పెంపుదలకు డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించాలని చెప్పారు. ప్రభుత్వ కాలేజీల్లో అత్యుత్తమ మార్కులపై ప్రచారం కల్పించాలని అధికారులను మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులతో మంత్రి నారా లోకేశ్ ఉండవల్లిలోని నివాసంలో గురువారం సమీక్ష నిర్వహించారు. నాణ్యమైన విద్యా బోధనకు ముఖ ఆధారిత హాజరు ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. ఉన్నత విద్యా సంస్థల్లో మరింత పారదర్శకత కోసం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్న ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ విషయంలో పకడ్బందీ చర్యలు చేపట్టాలని మంత్రి నారా లోకేష్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ డిగ్రీ, ఇంజనీరింగ్ తదితర ఉన్నత విద్యా సంస్థల వివరాలతో పాటు సిబ్బంది, విద్యార్థుల ముఖ ఆధారిత గుర్తింపు కోసం ఇప్పటివరకు చేపట్టిన చర్యలపై మంత్రి ఆరా తీశారు.


# పుట్టగొడుగుల్లా ఇసుక డంపులు..

## అనుమతులు ఉన్నాయా?

## ఫ్లెక్సీలు కట్టి మరీ విక్రయాలు..

## చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

## కట్రియాల క్రాస్, ఇల్లంద, వర్ధన్నపేటలో జోరుగా నిల్వలు




**వర్ధన్నపేట/ఏప్రిల్ 16(జర్నలిస్ట్ వార్త);** వర్ధన్నపేట మండలంలో ఇసుక విక్రయాలు నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నాయి. స్థానిక వాగుల నుంచి రవాణాపై నిషేధం ఉన్నప్పటికీ, గోదావరి ఇసుక ముసుగులో అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. మండల కేంద్రంతో పాటు కట్రియాల క్రాస్ రోడ్డు, ఇల్లంద పరిసర ప్రాంతాల్లో ప్రధాన రహదారుల వెంటే భారీ ఇసుక డంపులు వెలుస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఇసుక నిల్వ కేంద్రాలకు భూగర్భ గనుల శాఖ, రెవెన్యూ అధికారుల అనుమతులు తప్పనిసరి. కానీ, క్షేత్రస్థాయిలో ఎక్కడా అనుమతి పత్రాలు గానీ, అధికారిక రికార్డులు గానీ కనిపిస్తున్న దాఖలాలు లేవు. ఏకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మరీ బహిరంగంగా విక్రయాలు జరుపుతుండటం విస్మయానికి గురిచేస్తోంది.

### ఫ్లెక్సీలు ఒకటో రకం.. లోపల రెండో రకం.

విక్రయ కేంద్రాల వద్ద సిమెంట్, ఐరన్ తదితర సరుకుల లభించును అంటూ బోర్డులు పెట్టి అధికారులను మభ్యపెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తీరా లోపలికి వెళ్లి చూస్తే కేవలం ఇసుక కుప్పలు, ట్రాక్టర్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి. అసలు ఈ ఇసుక ఎక్కడి నుంచి వస్తోంది? బిల్లులు ఉన్నాయా? విక్రయించే ధర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. సామాన్యులు ఎవరైనా ఇలా డంపులు పెట్టుకోవచ్చా లేక కేవలం పలుకుబడి ఉన్నవారికే ఈ వెసులుబాటు ఉందా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. మండల కేంద్రానికి అత్యంత సమీపంలోనే ఇంత జరుగుతున్నా, మైనింగ్ , రెవెన్యూ, తదితర శాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడం వెనుక మర్మమేమిటో అర్థం కావడం లేదు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న ఈ అనధికారిక డంపులపై తక్షణమే విచారణ జరిపి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.